సాక్షి తిరుపతి

ఆదివారం । 17 । నవంబర్ । 2024



రైతు కన్నీళ్లు!

జిల్లాలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. - 8లో



తమిళ కూలీ అరెస్ట్

అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, తమిళ కూలీని అరెస్ట్ చేసినట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. - 8లో



ఫిర్యాదులొస్తున్నాయ్ జాగ్రత్త!

తిరుపతి బస్టాండ్‌లోని దుకాణాల్లో ఆహార పదార్థాల ధరల పెంపుపై ఫిర్యాదులొస్తున్నాయని డీపీటీఓ జగదీష్ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్య కల్యాణ మండపంలో కొలువు దీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామి,అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ నిర్వహించారు.

స్కాలర్‌షిప్ రెన్యూవల్‌కు 30 వరకు గడువు

తిరుపతి అర్బన్: పోస్ట్‌మెట్రిక్ స్కాలర్ షిప్ రెన్యూవల్ లేదా రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 30వ తేదీ వరకు విద్యార్థులకు అవకాశం ఉందని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి చెన్నయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు విద్యార్థులు తమ కళాశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించి సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలు అందించాలని సూచించారు. 2024–25 ఏడాదికి పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొత్తగా మూడు ప్యాకేజీ టూర్లు

తిరుపతి(అలిపిరి): కార్తీక మాసం సందర్భంగా తిరుపతి నుంచి కొత్తగా మూడు ప్యాకేజీ టూర్లను ప్రవేశపెట్టినట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ డివిజినల్ మేనేజర్ సీహెచ్. శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 17, 24 తేదీలలో ఒక్కరోజు మహానంది, శ్రీశైలం ప్యాకేజీ టూర్ ఉంటుందన్నారు. నాన్ ఏసీ బస్సులో 17, 24 తేదీలలో ఆదివారం రాత్రి 9 గంటలకు బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. బస్సు తిరిగి మూడో రోజు మంగళవారం ఉదయం 6 గంటలకు వస్తుందన్నారు. పెద్దలకు ఒక్కరికి టిక్కెట్ ధర రూ.3,050, పిల్లలకు రూ.2,440 (రవాణ చార్జీ, నాన్ ఏసీ, ఫ్రెషప్, భోజనం, గైడ్ సౌకర్యంతో కలిపి..) ఉంటుందని తెలిపారు. అలాగే తలకోన, శ్రీనివాసమంగాపురం టూర్ ప్యాకేజీకి (ప్రతి ఆది, సోమవారాలు) ఒకరికి రూ.400 (రవాణ చార్జీలు, గైడ్ సౌకర్యంతో కలిపి)లతో ఉంటుందన్నారు. రోజూ ఉదయం 9 గంటలకు బస్సు బయలుదేరి సాయంత్రం 5 గంటలకు తిరిగి చేరుకుంటుందని తెలిపారు. గుడిమల్లం ప్యాకేజీ టూర్‌లో తిరుచానూరు–అప్పలాయగుంట, గుడిమల్లం ఆలయాలకు రోజూ ఒక్కరికి రూ.400 (రవాణా చార్జీ, గైడ్ సౌకర్యంతో కలిపి...) ఉంటుందన్నారు. తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం నుంచి బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. ఈ కొత్త ప్యాకేజీ టూర్లను తిరుపతి, చిత్తూరు జిల్లా ప్రజలు, యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్లు 9848007033, 0877-2289123లో సంప్రదించాలని సూచించారు.

2024 జూలై 15

తిరుపతి జిల్లాలోని నాయుడుపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటన చోటుచేసుకుంది. కలుషిత ఆహారం తిన్న ఆ పాఠశాలలోని 89 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు లోనై ఆస్పత్రి పాలయ్యారు. పాడైన ఆహారం తినడంతో విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తేల్చిచెప్పారు.



చికిత్స పొందుతున్న నాయుడుపేట గురుకుల విద్యార్థులు (ఫైల్)

2024 ఆగస్టు 12



రేణిగుంట వసతి గృహంలో ఆస్పత్రికి వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

తిరుపతి జిల్లాలోని రేణిగుంట బీసీ బాలుర వసతి గృహంలో ఈ ఫుడ్ పాయిజన్ కారణంగా 21 మంది విద్యార్థులు అస్వస్థతకు లోనయ్యారు. ఆ వసతి గృహంలో కలుషిత ఆహారం తినడంతోనే విద్యార్థులకు వాంతులు, విరేచనాలయ్యి అస్వస్థతకు లోనయ్యారు. ఆ ఘటనను చూసిన తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

2024 నవంబర్ 16

తిరుపతి జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటన చోటుచేసుకుంది. కలుషిత ఆహారం తినడంతో 18 మంది బాలికలు అస్వస్థతకు లోనయ్యారు. వారిని వెంటనే రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. రెండు రోజుల పాటు నిల్వ ఉన్న ఆహారం విద్యార్థులకు పెట్టడంతోనే ఫుడ్ పాయిజన్ జరిగినట్టు అనుమానిస్తున్నారు.



తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

హాస్టళ్లలో ఆహాకారం

గురుకులాలు, హాస్టళ్ల విద్యార్థులు ఆహాకారాలు పెడుతున్నారు. పాచిన అన్నం, కూరలు వడ్డించడంతో తరచూ ఆస్పత్రులపాలవుతున్నారు. వసతుల లేమి.. కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారులు కూడా తమకేమీ పట్టనట్టు వ్యవహరించడంతో ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. నాలుగు నెలలుగా జరుగుతున్న వరుస ఘటనలతో తల్లిదండ్రులు సైతం ఆందోళనలో మునిగిపోతున్నారు. అయినా సంబంధిత కూటమి నేతలకు చీమకుట్టినట్టు కూడా లేకపోవడంతో విద్యార్థి సంఘాల నాయకులు రగిలిపోతున్నారు.



తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న గిరిజన గురుకుల బాలికలు

తరచూ ఫుడ్‌పాయిజన్లు, విషజ్వరాలు

- రాత్రి మిగిలిన కూరలను వడ్డిస్తున్న సిబ్బంది
- వసతుల లేమితో అవస్థలు పడుతున్న విద్యార్థులు
- తిరుపతి, చిత్తూరు సంక్షేమ వసతి గృహాల్లో పలు ఘటనలు
- తాజాగా తిరుపతి బైరాగిపట్టెడ గురుకుల పాఠశాలలో ఫుడ్‌పాయిజన్
- వరుస ఘటనలతో బెంబేలెత్తుతున్న తల్లిదండ్రులు
- శాపంగా మారుతున్న అధికారుల పర్యవేక్షణ లేమి

చిత్తూరు, తిరుపతి జిల్లాల సమాచారం

ఏపీ రెసిడెన్షియల్ గురుకులాలు	05
ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకులాలు	17
ఏపీ ట్రైబల్ గురుకులాలు	20
ఏపీ బీసీ రెసిడెన్షియల్ గురుకులాలు	12
అన్ని యాజమాన్యాల గురుకులాల్లో విద్యార్థులు	19,879
ఎస్సీ వసతి గృహాలు	119
ఎస్టీ వసతి గృహాలు	55
బీసీ వసతి గృహాలు	91
అన్ని యాజమాన్యాల వసతి గృహాల విద్యార్థులు	13,404

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల అధికారుల పర్యవేక్షణ లోపం విద్యార్థులకు శాపంగా మారింది. రెండు జిల్లాల్లో వరుసగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలు విద్యార్థులు, తల్లిదండ్రుల్లో భయాందోళన కలిగిస్తున్నాయి. వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు అనగానే నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందుతాయని తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పిస్తున్నా కానీ ఇటీవల కాలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా జరుగుతున్న వరుస ఘటనలు విద్యార్థుల తల్లిదండ్రులను కలవరపెడుతున్నాయి. చిత్తూరు జిల్లాలో ఎస్టీ, ఎస్సీ, ఏపీఎస్‌డబ్ల్యూఆర్, ఏపీ రెసిడెన్షియల్, ట్రైబల్, కేజీబీవీ, మహాత్మాగాంధీ పూలే, బీసీ సంక్షేమ వసతి గృహాలు 129 వరకు ఉన్నాయి. అలాగే తిరుపతి జిల్లాలో 136 వరకు సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలున్నాయి. చిత్తూరు, తిరుపతి జిల్లాలో వసతి గృహాల్లో, గురుకుల పాఠశాలల్లో 33,283 మంది విద్యార్థులు వసతి పొందుతూ విద్యనభ్యసిస్తున్నారు.

పేద విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కరువు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వసతి గృహాల్లో, గురుకుల పాఠశాలల్లో సమస్యలు అధికమయ్యాయి. అనేక ఘటనలు చోటు చేసుకుంటున్నప్పటికీ కూటమి సర్కారు వాటి బాగోగులపై కన్నెత్తి చూడడం లేదు. ముఖ్యంగా గురుకులాల్లో పరిస్థితి అత్యంత అధ్వానంగా మారింది. వసతి గృహాల్లో ఆహారం సరిగ్గా ఉండడం లేదని, అన్నంలో పురుగులు వస్తున్నాయని, కూరలు కూడా దారుణంగా ఉంటున్నాయని, విద్యార్థులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రతి నెలా వసతిగృహాలు, గురుకుల పాఠశాలల పరిస్థితులపై సమీక్షలు నిర్వహించాల్సిన ఉన్నతాధికారులు అలసత్వం వహిస్తున్నారు. ఈ క్రమంలో చాలా మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు.

పౌష్టికాహార లక్ష్యం.. అమలుకు దూరం

తల్లిదండ్రులకు దూరంగా వసతిగృహాల్లో ఉంటున్న పేద విద్యార్థులకు పౌష్టిక విలువలు కలిగిన భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యం. అయితే ఆ లక్ష్యం సాక్షాత్తు సీఎం చంద్రబాబు నాయుడు సొంత జిల్లాల్లోనే అమలు కాకపోవడంపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. పేద పిల్లలకు మెరుగైన విద్యతో పాటు పౌష్టికాహారం ఇవ్వాలి. విద్యార్థులకు పౌష్టికాహారం సంగతి పక్కన పెడితే.. ఉడకని అన్నం, సగం ఉడికిన కూరలు, నిల్వ ఉంచిన ఆహారం పెడుతున్నారు. పక్కాగా అమలు చేయాల్సిన మెనూ గోడలకు మాత్రమే పరిమితం అయ్యింది. రెండు జిల్లాల్లో 80 శాతానికి పైగా వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. ఆ విద్యార్థులు తమ ఆవేదనను ఎవరికి చెప్పుకోవాలో తెలియక లోలోన సతమతమవుతూ బక్క చిక్కి పోతున్నారు.

తనిఖీలు తూచ్

చిత్తూరు, తిరుపతి జిల్లాలోని వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో నియమ, నిబంధనల ప్రకారం ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించడం లేదు. సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, డివిజన్ అధికారులు కనీసం నెలలో ఒక్కసారైనా వాటి వైపు కన్నెత్తి చూడడం లేదు. తనిఖీలు లేకపోవడంతో వసతి గృహాల్లో పలు ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్న విమర్శలున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేయకపోవడంతో విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. వసతి గృహాలకు వెళ్లి వైద్య చికిత్సలు చేయాల్సిన వైద్యులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. నిబంధనల ప్రకారం ప్రతి నెలా వైద్యులు వసతి గృహాలకు వెళ్లి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పరీక్షించాలి. అయితే చిత్తూరు, తిరుపతి జిల్లాలో 30 శాతం వసతి గృహాల్లో కూడా అలా జరగడం లేదు. చికిత్సలు చేసినట్టయితే వసతి గృహాల్లో ఉండే రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంది. కొన్ని వసతి గృహాల్లో రిజిస్టర్లే అమలు చేయకపోవడం కొసమెరుపు.

ఇంకెన్ని ఘటనలు జరగాలి?



రెండు జిల్లాల్లో వసతి గృహాల్లో, గురుకుల పాఠశాలల్లో వరుసగా ఘటనలు జరుగుతున్నాయి. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం ఏ మాత్రం స్పందించపోవడం దారుణం. గతంలో ఎన్నడూ లేని విధంగా వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పేద పిల్లల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ఇలాగేనా వ్యవహరించేది. మా సంఘం ఆధ్వర్యంలో వసతి గృహాల పరిశీలన చేసిన సమయంలో విద్యార్థులు అనేక సమస్యలు చెప్పుకొచ్చారు. మెనూ అమలు కావడం లేదని, నాసిరకం భోజనం పెడుతున్నారని చెప్పారు. ఆ సమస్యలన్నీ అధికారులు దృష్టికి సైతం తీసుకెళ్లాం. అయినప్పటికీ మార్పు లేకపోవడం బాధాకరం. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే ఆందోళనలు చేస్తాం.

– శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తిరుపతి జిల్లా

ప్రాణాలు పోతేనే స్పందిస్తారా?



పేద విద్యార్థుల ప్రాణాలు పోతేనే కూటమి ప్రభుత్వం స్పందిస్తుందా?. వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మౌళిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోవడం దారుణం. నిల్వ ఉంచి ఆహారం విద్యార్థులకు పెట్టడంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. సీఎం సొంత జిల్లాల్లో ఇలాంటి ఘటనలు జరగడంతో పరిపాలన ఎలా ఉందన్న విషయం అర్థమవుతోంది. తీరు మార్చుకుని పేద పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

– నాగరాజు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, చిత్తూరు జిల్లా

ఉద్యోగాలు వదిలేయాలనే!

సచివాలయ ఉద్యోగులపై చిన్నచూపు

- పరాకాష్టకు చేరిన కూటమి ప్రభుత్వ వేధింపులు
- జియో ట్యాగింగ్ సర్వే చేయాలని తీవ్ర ఒత్తిడి
- బయోమెట్రిక్ హాజరుతో మెడపై కత్తి
- వేతనాల్లో కోత పెట్టాలని తాజాగా ఆదేశాలు
- ఇళ్లకు వచ్చి ఫొటోలు తీస్తుండడంపై ప్రజల నుంచి వ్యతిరేకత



వేదాంతపురంలో చేస్తున్న సర్వేను పరిశీలిస్తున్న తిరుపతి రూరల్ ఎంపీడీఓ రామచంద్ర (ఫైల్)



జియో ట్యాగింగ్ కోసం రూపొందించిన యాప్

తిరుపతి రూరల్: 'ఇంటికొచ్చి ఫొటో ఎందుకు తీస్తున్నారు. ఆ అధికారం మీకు ఎవరిచ్చారు...? ఏపీ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు చూపించండి. ఏం వేళాకోళంగా ఉందా? ఫొటో లేదు....గిటో లేదు. వెళ్లండి' అంటూ జియోట్యాగింగ్ సర్వే కోసమని ఇళ్లకు వెళ్తున్న సచివాలయ ఉద్యోగులకు ప్రజానీకం నుంచి ఎదురవుతున్న ఛీదరింపులు ఇవీ. 'ఆ..సచివాలయ ఉద్యోగులా.. మాకేం సర్వే అక్కర్లేదు..' అంటూ అపార్ట్‌మెంట్ వాసులు నుంచి పరాభవం ఎదురవుతోంది. మొత్తంగా కూటమి ప్రభుత్వం తీరుతో సచివాలయ ఉద్యోగులు ప్రస్తుతం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులమైన తమకు ఎన్నాళ్లీ అవమానాలంటూ వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయి విధుల్లో ఎదురవుతున్న ఇబ్బందులు వినే వారు లేక లోలోన రగిలిపోతున్నారు. టార్గెట్ల పేరుతో ఉన్నతాధికారుల నుంచి వేధింపులు ఎక్కువవుతుండడంతో తామెందుకీ ఉద్యోగానికి వచ్చామా..? అని కుంగిపోతున్నారు. తామంతా సచివాలయ ఉద్యోగాలను వదిలిపెట్టి పోవాలనేదే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని కొంత మంది బహాటంగానే నిట్టూర్పులు వెళ్లగక్కుతున్నారు.

ఉద్యోగులా ? వలంటీర్లా?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ ఉద్యోగులపై మరింత పనిభారం పెరిగింది. ఇటీవల వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా 'మా మంచి ప్రభుత్వం' అంటూ ముద్రించిన స్టిక్కర్లను సచివాలయ ఉద్యోగులే ఇళ్లకు వెళ్లి అంటించారంటే వారి దుస్థితిని అర్థం చేసుకోవచ్చు. డిగ్రీ, పోస్టు గ్రాడ్యూయేషన్ అర్హతతో పరీక్షల్లో మెరిట్ సాధించి ఉద్యోగాల్లో చేరిన తమను కూటమి ప్రభుత్వం పెద్ద వలంటీర్లు మాదిరిగా వినియోగించుకుంటోందని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జియో ట్యాగింగ్ కోసం తీవ్ర ఒత్తిడి

చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 108 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో పనిచేస్తున్న ఉద్యోగులంతా ప్రస్తుతం జియో ట్యాగింగ్ సర్వేలో నిమగ్నమయ్యారు. 'ఎంప్లాయీస్ మొబైల్ అప్లికేషన్' పేరిట రూపొందించిన యాప్‌లో ప్రతీ ఇంటినీ ఫొటో తీసి, జియో ట్యాగింగ్ చేసేలా ఆయా సచివాలయాల పరిధిలోని గృహాల సంఖ్యకు అనుగుణంగా టార్గెట్లు పెట్టారు. సర్వే సమయంలో గృహ యాజమాని బయోమెట్రిక్ లేదా ఫేసియల్ అంథెంటికేషన్ ఇవ్వాలి. దీనిపై ప్రజానీకం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో సక్సెస్ అవుతున్నా, చాలా గ్రామాలు, అపార్ట్‌మెంట్లు, అర్బన్ పంచాయతీల్లోని ప్రజానీకం జియో ట్యాగింగ్‌కు అంగీకరించడం లేదు. జిల్లా అధికారులు ఇవేవీ పట్టించుకోకపోగా, సాయంత్రానికి ఎన్ని ఇళ్లు చేశారని సమీక్షలు చేస్తూ సచివాలయ ఉద్యోగులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వేతనాల కోతకు సిద్ధం!

తీవ్రమైన పని ఒత్తిడితో సతమతమవుతున్న సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వులు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. గత నెల 22 నుంచి ఈ నెల 21వ తేదీ వరకు నమోదైన బయోమెట్రిక్ హాజరును పరిగణనలోకి తీసుకుని సచివాలయ ఉద్యోగులకు నవంబర్ వేతనాలు చెల్లించాలని గురువారం జారీచేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. క్షేత్రస్థాయి పర్యటనలు, సర్వర్ ఇబ్బందులతో సవ్యంగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేసుకోలేని సచివాలయ ఉద్యోగులకు ఈ నెల జీతంలో కోత పడనుంది. డిసెంబర్ 1న అందుకోబోయే వేతనం ఎంత వస్తుందోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులమే అయినప్పటికీ, తమపైనే ఎందుకీ కక్షపూరిత చర్యలు అంటూ సచివాలయ సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విధుల్లో భాగంలోనే...

ప్రభుత్వం నిర్దేశించిన విధులను ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా చేయాల్సిందే. విధుల్లో భాగంగానే హౌస్ హోల్డ్ సర్వే జరుగుతోంది. క్లస్టర్ల వారీగా జియో ట్యాగింగ్ చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులపై ఎలాంటి ఒత్తిళ్లు లేవు.

– రామచంద్ర, ఎంపీడీఓ, తిరుపతి రూరల్

మౌలిక వసతులకు ఎంపీ నిధులు



సత్యవేడు గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ గురుమూర్తి, సమన్వయకర్త నూకతోటి రాజేష్

- విద్యార్థులకు నాణ్యమైన ఆహారం పెట్టాలి
- కుళ్లిన కూరగాయలు వండిపెడితే ఎలా?
- సత్యవేడు బీసీ గురుకుల సిబ్బందిని ప్రశ్నించిన ఎంపీ గురుమూర్తి

సత్యవేడు: 'గురుకులంలో సమస్యలపై వెంటనే ఇంజినీర్లతో ఎస్టిమేషన్లు వేసి పంపండి.. నా నిధులు మంజూరు చేస్తా..' అని తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి సిబ్బందిని ఆదేశించారు. తిరుపతి పార్లమెంటు పరిధిలోని సత్యవేడు ఎంజేపీఏపీ బీసీ బాలుర గురుకులానికి చెందిన 56 మంది విద్యార్థులు తీవ్ర జ్వరంతో అస్వస్థతకు గురై వైద్యశాలలో చేరిన విషయం తెల్సిందే. విషయం తెలుసుకున్న ఎంపీ డాక్టర్ గురుమూర్తి, వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, ఎంపీపీ, జెడ్పీటీసీ, పార్టీ నాయకులతో కలసి శనివారం వారిని పరామర్శించారు. గురుకుల పాఠశాల ప్రత్యేక వైద్య శిబిరం గదిలో ఉన్న 22 మంది విద్యార్థులను కలసి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. దోమలు రాకుండా కిటికీలకు దోమతెరలు అమర్చాలని విద్యార్థులు కోరారు. ఆర్వో ప్లాంట్ షాక్ కొడుతోందని వాపోయారు.

కుళ్లిన వంకాయలు వండిపెడితే ఎలా?

గురుకుల పాఠశాలలోని భోజన శాలను, వంట గదులను ఎంపీ పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి తీసుకొచ్చిన కూరగాయలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఎస్టిమేషన్లు పంపండి

కావాల్సిన పనులకు సంబంధించి ఇంజినీర్లతో ఎస్టిమేషన్లు వేసి పంపాలని ఎంపీడీఓ చంద్రశేఖర్, ప్రిన్సిపల్ శ్రీనివాసులును ఆదేశించారు. నేతలు బీరేంద్రవర్మ, భానుప్రకాష్‌రెడ్డి, మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ పీ.ప్రతిమ, జిల్లా ప్రధాన కార్యదర్శి కే.చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కేవీ.నిరంజన్‌రెడ్డి, మహిళా కార్యదర్శి మస్తానీ, రమేష్, ఎంపీ రవి, శ్యాంప్రసాద్‌రెడ్డి, గోవిందస్వామి, మునివేలు, పునిదకుమార్, పళని, టెంకాయల కృష్ణయ్య, ఎంపీటీసీ శరవణ, సర్పంచులు రవిరెడ్డి, శేఖర్, జయ, రూబెన్, గోవిందస్వామి, ఆర్.హరిబాబు, శ్రీధర్‌రెడ్డి, రాబర్ట్ ఉన్నారు.

క్లుప్తంగా

పోర్టు నిర్మాణానికి కట్టుబడాలి



నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి చింతా మోహన్

చిల్లకూరు: రాష్ట్రంలో పోలవరం, అమరావతినే కాదు, దుగ్గరాజ పట్నం పోర్టు నిర్మాణానికి కూడా సీఎం చంద్రబాబు కట్టుబడి ఉండాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్ డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ ప్రాంతంలో ఆయన శనివారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలసి దుగ్గరాజ పట్నం ఓడ రేవు కోసం నిరసన చేపట్టారు. ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటుగా గూడూరు ప్రాంతం మరో విశాఖ పట్నంలా రూపు రేఖలు మారేందుకు దోహద పడే దుగ్గరాజపట్నం పోర్టును వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం


షణ్ముగం(ఫైల్)

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురం సమీపంలోని బ్రిడ్జి వద్ద గురువారం మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభించినట్లు ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపారు. తిరుపతి, కొర్లగుంట, సంజయ్ గాంధీ కాలనీకి చెందిన దొరస్వామి కుమారుడు షణ్ముగం(50) ఈనెల 13వ తేదీన పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఈ క్రమంలో 14వ తేదీ సాయంత్రం శ్రీనివాసమంగాపురం సమీపంలోని బ్రిడ్జి కింద శవమై కనిపించాడు. గుర్తుతెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. పత్రికల్లో వచ్చిన వార్తను చూసి మృతుడి తండ్రి శనివారం ఉదయం రుయా హాస్పిటల్‌లోని మార్చురీకి వెళ్లి మృతుడిని గుర్తించి, చంద్రగిరి పోలీసులను సంప్రదించాడు. మృతుడికి భార్య రమ్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఎస్ఐ రవీంద్ర నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు కన్నీళ్లు!


నీట మునిగిన వరిని చూపుతున్న రైతు


నీట మునిగిన వరి

- మునిగిన వరి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి జంబుగోళం గ్రామంలోని వరి పంట నీట మునిగింది. గ్రామానికి చెందిన రైతులు పైపురిదేవి, రంగమ్మ, శ్రీరాములయ్య, దివాకర్, కత్తిసురేష్, ప్రభావతి, అన్నపూర్ణ, బుజ్జమ్మ, కత్తిరవి, ధరయ్య, జానకీరామయ్య 35 ఎకరాలలో వరి పంట సాగుచేశారు. వర్షాల కారణంగా నాలుగు రోజులుగా పంట నీటిలోనే ఉండడంతో పాచిపోయి దెబ్బతింది. ఎకరా వరి వేయడానికి రూ.20 వేల వరకు ఖర్చయిందని, వర్షంతో పూర్తిగా నష్టపోయామని రైతులు వాపోయారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరారు.

సమస్యలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించండి


రుయా ఆస్పత్రి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తిరుపతి తుడా: జిల్లాలో వరుసగా నాలుగు నెలల నుంచి గురుకుల పాఠశాలల విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని, సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రుయా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. అనంతరం రుయా హాస్పిటల్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ జిల్లా అధికారుల నిర్లక్ష్యం వల్లే విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని ఆరోపించారు. జిల్లాలో నాలుగు నెలల నుంచి వరుసగా డక్కిలి, నాయుడుపేట, రేణిగుంట గురుకుల పాఠశాలలతో పాటు తిరుపతి నగరంలోని బాలికల వసతి గృహాల విద్యార్థినులు అస్వస్థతకు గురవుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే కలెక్టర్ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలల సమస్యలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, బీసీ విద్యార్థి సంఘ నాయకులు తిరుమలేష్, జీఎస్ఎస్ నాయకులు శివశంకర్ నాయక్, ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్ర, హరికృష్ణ, అశోక్, తేజ పాల్గొన్నారు.

వారిపై చర్యలు తీసుకోండి

తిరుపతి సిటీ: బైరాగిపట్టెడలోని గిరిజన బాలికల వసతి గృహంలో కలుషిత ఆహారానికి కారకులైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రుయాలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను వారు పరామర్శించారు. గిరిజన వసతి గృహాలలో పర్యవేక్షణ కరువైందని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు మన్నం ప్రేమ్‌కుమార్, నారాయణగౌడ్, సుబ్రహ్మణ్యం, కొండయుగంధర్, ముని, మహేంద్రనాయక్ పాల్గొన్నారు.

రామ్మూర్తి నాయుడు మృతికి చెవిరెడ్డి సంతాపం

చంద్రగిరి: మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతి పట్ల చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తన సంతాపం వ్యక్తం చేశారు. అందరికీ మంచి చేసే మనస్సున్న వ్యక్తిగా, రాజకీయ రంగంలో అజాత శత్రువుగా రామ్మూర్తి అన్న చిర స్థాయిగా నిలిచారని కొనియాడారు. 1994లో చంద్రగిరి ఎమ్మెల్యేగా ఆయన అన్ని వర్గాల ప్రజలను ఆదరిస్తూ పార్టీలకు అతీతంగా మంచి చేశారని, ఆయన ఎక్కడ ఉన్నా హుందా రాజకీయాలు చేశారని చెవిరెడ్డి గుర్తుచేశారు. రామ్మూర్తి అన్న మరణం చంద్రగిరి ప్రజలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ ఖాళీగా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 61,613 మంది స్వామివారిని దర్శించుకోగా 20,291 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.12 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

బాలుడి అదృశ్యం


మునిశ్యామ్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో ఇంటర్ సెకండీయర్ చదువుతున్న బాలుడు అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసుల కథనం.. మునిరాజా కుమారుడు మునిశ్యామ్ పట్టణంలోని ఒక ప్రయివేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం పుస్తకం తీసుకొస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. మళ్లీ తిరిగి రాలేదు. ఇంట్లో ఓ పేపర్‌పై 'అమ్మా నాన్నా నన్ను వెతకవద్దు.. బస్సు చార్జీల కోసం రూ.500 తీసుకున్నాను' అని రాసిపెట్టాడు. దీంతో తల్లిదండ్రులు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు 9440900008 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

ఫిర్యాదులొస్తున్నాయ్ జాగ్రత్త!

తిరుపతి అర్బన్: తిరుపతి బస్టాండ్‌లోని దుకాణదారులు ఎమ్మార్పీకి మించి వస్తువులను విక్రయిస్తున్నారని పలు ఫిర్యాదులు వస్తున్నాయని, అంతా జాగ్రత్తగా ఉండాలని జిల్లా ప్రజారవాణా అధికారి జగదీప్ హెచ్చరించారు. శనివారం ఆయన తిరుపతిలోని తమ కార్యాలయంలో బస్టాండ్‌లో దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు వస్తువులను విక్రయిస్తే తాము జోక్యం చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇలాగే వ్యవహరిస్తే తిరుపతి గౌరవానికి భంగం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తమకు కేటాయించిన ప్రాంతంలోనే వ్యాపారాలు చేసుకోవాలని చెప్పారు. డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డితో పాటు ఏటీఎం డీఆర్.నాయుడు పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సత్యవేడు: శ్రీసిటీలోని కంపెనీలకు ఇంటర్వ్యూల కోసం వచ్చిన ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఏ.స్టాలిన్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ బీవీ శ్రీనివాసులు తెలిపారు. గత సోమవారం ఆరూరు నుంచి శ్రీసిటీకి వెళ్లేందుకు వచ్చిన మహిళను కంపెనీ వద్దకు తీసుకుపోతానని చెప్పి సమీపంలోని మామిడి తోపులోకి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో వదిలేశాడు. ఆమె శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేసి డీఎస్పీ సమక్షంలో స్టాలిన్‌ను అరెస్టు చూపారు.

కళ్లెదుటే బిడ్డలు మునిగిపోయారు!

- సొన కాలువలో ఈతకు వెళ్లి ఇద్దరు చిన్నారుల మృతి
- తల్లడిల్లిన తల్లిదండ్రులు
- అల్లిపురం గిరిజన కాలనీలో తీవ్ర విషాదం


మృతి చెందిన చింతాలయ్య, నాగేంద్రమ్మ

చిల్లకూరు: ఈత సరదా ఇద్దరి పిల్లల ప్రాణాలు తీసింది. కళ్లెదుటే బిడ్డలు మునిగిపోతుంటే చూస్తూ తట్టుకోలేక ఆ తల్లులు పడిన వేదన చూపరులను కలచివేసింది. ఈ ఘటన చిల్లకూరు మండలం, ఏరూరు గ్రామంలోని అల్లిపురం గిరిజన కాలనీ సమీపంలో శనివారం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసుల వివరాల మేరకు.. అల్లిపురం గిరిజన కాలనీకి చెందిన ఐదుగురు మహిళలు తమ బిడ్డలతో కలసి గ్రామానికి సమీపంలో ఉన్న సొన కాలువ వద్ద బట్టలు ఉతికేందుకు వెళ్లారు. అక్కడ కుడుముల నాగేంద్ర, రాములమ్మ మూడో సంతానం నాగేంద్రమ్మ(11), కుందకూరు ఏడుకొండలు, సుబ్బమ్మ ఐదో సంతానం చింతాలయ్య (10)తో పాటుగా మరో ముగ్గురు కాలువలో ఈత కొట్టేందుకు దిగారు. అయితే కాలువలో నీరు ఎక్కువగా ఉండడంతో భయంతో ముగ్గురు పిల్లలు గట్టుకు వచ్చేశారు. నాగేంద్రమ్మ, చింతాలయ్య మాత్రం గట్టు ఎక్కలేక నీటిలో మునిగిపోయారు. చిన్నారుల తల్లులు కేకలు వేయడంతో కాలనీకి చెందిన కొంతమంది అక్కడికి వెళ్లి కాలువలోకి దిగి పిల్లలను రక్షించే ప్రయత్నం చేశారు. అయినా ఫలించ లేదు. అప్పటికే ఇద్దరూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ముక్కంటి సేవలో శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి


శ్రీకాళహస్తి: ఆలయంలో శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర్ భారతీ తీర్థ స్వామిజీ


పెంచలకోనలో విధుశేఖర భారతి తీర్థ సామీజీ

శ్రీకాళహస్తి: శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి తీర్థ స్వామిజీ శనివారం శ్రీకాళహస్తిలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. సాధారణంగా ప్రముఖులు దక్షిణ గాలిగోపురం వద్ద నుంచి ఆలయంలోకి విచ్చేస్తారు. అయితే విధుశేఖర భారతి తీర్థ స్వామిజీ సాధారణ భక్తులు విచ్చేసే భిక్షాల గాలిగోపురం వద్ద నుంచి ఆలయంలోకి ప్రవేశించారు. భిక్షాల గాలిగోపురం వద్ద ఆయనకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వద్ద భక్తులకు ఆయన అనుగ్రహ భాషణం చేశారు.

నృసింహుని సేవలో విధుశేఖర భారతి మహాస్వామి

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామిని శనివారం శృంగేరి శారదా పీఠాధీశ్వరులు విధుశేఖర భారతి తీర్థ స్వామి దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు దేవస్థాన అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత దేవస్థాన వేదపండితులు ఘనంగా సత్కరించి వేద ఆశీర్వచన అందించారు. స్వామీజీ వెంట దేవదాయ ధర్మదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఆ డాక్టర్‌మ్మకు నిబంధనలు వర్తించవా?


అప్రాన్ లేకుండా విధుల్లో ఉన్న అసోసియేట్ ప్రొఫెసర్

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రిలో ఆ డాక్టరమ్మ రూటే సపరేటు. ఆమె విధుల్లో ఉన్నా నిబంధనలు పాటించరు. శనివారం ట్రైబల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహ విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంతో రుయా ఎంఎం వార్డులో చికిత్స అందించారు. జిల్లా అధికారులు, రుయా సూపరింటెండెంట్లు అక్కడ పర్యవేక్షణలో ఉన్నా ఆ అసోసియేట్ ప్రొఫెసర్ నిబంధనలు పాటించకపోవడం విమర్శలకు తావిచ్చింది. తెల్లకోటు (అప్రాన్) ధరించకుండానే రోగులకు చికిత్స అందించారు. కొందరు ఆమెను పేషెంట్ అంటుండగా.. అక్కడున్న జూనియర్ డాక్టర్లు కలుగజేసుకొని ఆమె అసోసియేట్ ప్రొఫెసర్ అని అధికారులకు గుర్తుచేశారు.

రేకుల షెడ్డులో అగ్నిప్రమాదం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న టీటీడీ వీజీఓ సురేంద్ర, ఏవీఎస్ఓ శైలేంద్ర తదితరులు

తిరుమల:తిరుమలలో వివిధ నిర్మాణ పనులు, పెయింటింగ్ పనులు చేసే కార్మికులు నివాసం ఉండే రేకుల షెడ్డు అగ్ని ప్రమాదానికి గురైన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానిక బాటగంగమ్మ ఆలయానికి వెళ్లే దారిలో కొందరు కార్మికులు రేకులతో షెడ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఉదయం ఆకస్మాత్తుగా ఒక రేకుల షెడ్డులోని నాలుగు గదుల్లో మంటలు చెలరేగాయి. అందులోని వారందరూ పనులకు వెళ్లగా ఒక్క మహిళ మాత్రం అందులో ఉంది. మంటలతో అప్రమత్తమైన ఆమె కేకలు వేయడంతో స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఘటనా స్థలాన్ని టీటీడీ తిరుమల వీజీవో సురేంద్ర, ఏవీఎస్‌వో శైలేంద్ర పరిశీలించారు. గ్యాస్ సిలిండర్ లేదా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. అయితే ఈ ప్రమాదంలో స్వల్పంగా ఆస్తి నష్టం సంభవించినట్లు అధికారులు తెలిపారు.

ఎర్రచందనంతో పాటు తమిళ కూలీ అరెస్ట్

చంద్రగిరి: అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలతో పాటు ఒకరిని ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ అధికారులు అదుపులోకి తీసుకున్న ఘటన శ్రీవారిమెట్టు సమీపంలోని శేషాచలం అడవుల్లో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ఆదేశాల మేరకు, ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్‌కుమార్ బృందం స్థానిక అటవీ అధికారులతో కలసి శ్రీవారి మెట్టు నుంచి శనివారం కూంబింగ్ చేపట్టింది. చీకటికోన వద్ద శనివారం ఉదయం కొంతమంది ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా దుంగలు పడేసి పారిపోతుండగా, తమిళనాడులోని తిరువణ్ణామలై జిల్లాకు చెందిన ఒక కూలీని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం నిందితుడి నుంచి 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రఫీ తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నాగలాపురం: ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పిచ్చాటూరు మండలం, అప్పంబట్టు జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ కథనం.. రామగిరి గ్రామానికి చెందిన ఏ.ఆర్ముగం రెడ్డి (65) వృత్తిరీత్యా పశువుల వ్యాపారి. పనుల నిమిత్తం అప్పంబట్టు వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న హోటల్‌లో శనివారం ఉదయం టిఫిన్ తిని తిరిగి స్వగ్రామమైన రామగిరి వైపు నడిచి వెళ్తున్నాడు. అదే సమయంలో పుత్తూరు వైపుగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో ఆర్ముగంరెడ్డి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

డీఎస్సీ ఉచిత కోచింగ్ ప్రారంభం


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: డీఎస్సీ ఉచిత కోచింగ్‌ను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ కోరారు. శనివారం ఆయన తిరుపతి నగరంలోని ఎమ్మార్‌పల్లి సర్కిల్ సమీపంలో ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ ఉచిత కోచింగ్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 రోజుల పాటు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా కోచింగ్ తీసుకునే వారికి స్టడీ మెటీరియల్ కోసం రూ.1000, స్టైఫండ్‌గా నెలకు రూ.1500 చొప్పున రెండు నెలలకు రూ.3 వేలు ఇస్తారని స్పష్టం చేశారు. 220 మందికి శిక్షణకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి చంద్రశేఖర్, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య, జిల్లా సహకార అధికారి లక్ష్మి, బీసీ వెల్ఫేర్ సహాయ జిల్లా అధికారి జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.